సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..


# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

| సంపుటి : 02 | సంచిక : 51 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 05.06.2025 |
|---|---|---|---|---|




పారదర్శకంగా ఇందిరమ్మ

## లబ్ధిదారుల ఎంపిక

3 లో

రాజకీయ కక్షతోనే

# కేసీఆర్‌కు నోటీసులు

**హైదరాబాద్, మన చౌరాస్తా :**

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద బుధవారం మహా ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జ్ ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత

- ఆయన ఏం తప్ప చేశారు?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమన్నారు.

**ఇందిరా పార్క వద్ద ఉద్రిక్తత**

హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ప్రాంగణం బుధవారం ఉదయం ఉద్రిక్త వాతావరణాన్ని చూసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జారీ చేసిన నోటీసులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ ధర్నాకు భారీ సంఖ్యలో జాగృతి కార్యకర్తలు తరలివచ్చారు. ఈ ధర్నా సందర్భంగా పోలీసులు జాగృతి కార్యకర్తలను అరెస్ట్ చేసిన అంశాన్ని కూడా కవిత తీవ్రంగా ఖండిరచారు. 'మంచిర్యాల, రామగుండం ప్రాంతాల నుంచి ధర్నాకు వస్తున్న కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడం ఎంత దుర్మార్గం. ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని, హైదరాబాద్‌లో అవకాశం ఇవ్వకపోతే గల్లీల్లో ధర్నాలు చేస్తాం.. ఇది ఉద్యమం' అని స్పష్టం చేశారు. ఈ నిరసనతో తెలంగాణ జాగృతి ఉద్యమం మరోసారి సజీవంగా మారిందని కవిత జోష్ చూపించారు. ఈ ధర్నా ద్వారా కవిత తిరిగి బలమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించినట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



# పల్లీ చట్నీలో బల్లి

## ■ హోటల్‌ను సీజ్ చేసిన అధికారులు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో ఓ హోటల్‌లో తయారు చేసిన పల్లీ చట్నీలో బల్లి అవశేషాలు కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. బుధవారం జిల్లా కేంద్రంలో ఈ ఘటన వివరాలు బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని సాయి కృష్ణా హోటల్‌లో గుండ్లగడ్డకు చెందిన సిరాజుద్దీన్ అనే యువకుడు బుధవారం ఉదయం వడ పార్సిల్ తీసుకున్నాడు. ఇంటికి వెళ్లి టిఫిన్ తింటుండగా చట్నీలో బల్లి అవశేషాలు కనిపించడంతో ఒక్కసారిగా కంగు తిన్నాడు. వెంటనే బాధితుడు హోటల్ చేరుకుని యాజమాన్యాన్ని నిలదీయగా అది ఆకు కూర అంటూ కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారని ఆరోపించాడు. హోటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు ఫిర్యాదు చేశాడు. హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

### చర్యలు తీసుకుంటాం : ఫుడ్ సేఫ్టీ అధికారి



బాధితుడుడి ఫిర్యాదు మేరకు సాయికృష్ణ హోటల్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారి వినీల్ కుమార్తో పాటు డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ చేతన్, సీఐ దామోదర్‌రెడ్డి, మున్సిపల్ అధికారి పులి శేఖర్ పరిశీలించారు. ఈ మేరకు హోటల్ యజమానికి రూ.10 వేల జరిమానా వేయడంతో పాటు ఫుడ్ శాంపిల్స్ సేకరించారు. హోటల్‌ను మూసి వేయించారు. ఫుడ్ విషయంలో ఏమైనా నిర్లక్ష్యం జరిగినట్టు తెలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు.



# భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

## ■ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపురం గ్రామాన్ని సందర్శించి భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహణ తీరును పరిశీలించారు. వారసత్వం, సాదా బైనామా దరఖాస్తులు ఎక్కువ వచ్చినట్లు తహసీల్దార్ కలెక్టర్ కు తెలిపారు. తహసీల్దార్ మోసిన్‌ను దరఖాస్తుల స్వీకరణపై కలెక్టర్ వివరణ కోరగా 59 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సదస్సు యొక్క విశిష్టత గ్రామంలో ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా మోర్తాల మహేందర్ ఫిర్యాదు మేరకు అతని తల్లి రాధమ్మను రప్పించి కుటుంబ వివాదం త్వరగా పరిష్కరించుకోగలిగితే భూ సమస్య కూడా త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. సాధ్యమైనంత వరకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. హెల్ప్ డెస్క్ ను సందర్శించి దరఖాస్తులను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మోసిన్, రెవెన్యూ శాఖ సిబ్బంది ఉన్నారు.

# బ్యూటిఫికేషన్ పనుల పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా :** రూ.30 లక్షలతో చేపట్టిన జనగామ పట్టణ సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జనగామ పట్టణానికి సంబంధించి హనుమకొండకు వెళ్లే దారిలో సీబీఎఫ్ నిధులతో నిర్మిస్తున్న ఆర్చి, విద్యుద్దీకరణ పనులను సంబంధిత మునిసిపల్ అధికారులతో కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. జనగామ ముఖ ద్వారం ప్రయాణికులకు పట్టణ ప్రజలకు ఆకర్షణీయంగా కనిపించే విధంగా సుందరీకరణ పనులను చేపట్టాలని అన్నారు. విద్యుద్దీకరణతో హైవేపై వెళ్లే వారికి కూడా జనగామ ముఖద్వారం అందంగా కనిపించే విధంగా రూపొందించాలన్నారు. స్వాగతం తో పాటు ప్రభుత్వ చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగింపజేయాలని అందమైన చెట్లను నాటింపచేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహిపాల్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.





# ప్రతి భూ సమస్య పరిష్కరించాలి

## ■ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ లింగాలఘణపూర్ మండలం చీటూర్ గ్రామాన్ని సందర్శించి భూ భారతి సదస్సు నిర్వహణ తీరును పరిశీలించారు. సదస్సులో ప్రతి ఒక్కరూ అందించిన దరఖాస్తును పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. రైతుల సమస్యలను ముందుగా అర్థం చేసుకోవాలన్నారు. హెల్ప్ డెస్క్ సహకారంతో దరఖాస్తులను ఎటువంటి తప్పులు దొర్లకుండా పూర్తి చేసి వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో లింగాలఘణపూర్, రఘునాథపల్లి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పుస్తె మట్టెలు అందజేత

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన కళ్యాణం నర్సవ్వ, బాలనర్సయ్య కుమార్తె రేణుక వివాహానికి వాస్విక్ ఫౌండేషన్ వారు పుస్తెమట్టెలు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి పుస్తె మట్టెలను, ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆముదాల భూపాల్ రెడ్డి, నూకల నర్సిరెడ్డి , శివరాత్రి మహేష్ చేతుల మీదుగా వాటిని అందించారు. ఈ సందర్భంగా రేణుక కుటుంబ సభ్యులు ఫౌండేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.





## జనగామలో పోలీసు కవాతు

**జనగామ, మన చౌరాస్తా :** వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో జనగామలో కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ నుంచి నెహ్రూ పార్క్ మీదుగా రైల్వే స్టేషన్ గుండ్లగడ్డ ఏరియాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు, పోలీసులు కవాతులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఈ కవాతు నిర్వహించామని, ప్రజలందరూ సంతోషంగా తమ తమ పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పండరి చేతన్ నితిన్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ సరస్వతి, సీఐ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# కేజీబీవీలలో బాలికల నమోదును పెంచాలి

### అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



**జనగామ, మన చౌరాస్తా :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యను బలోపేతం చేయడంలో భాగంగా నమోదు సంఖ్యను పెంచాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి 12 మంది కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలికల విద్యను బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. అందుకొరకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు భద్రతతో కూడిన విద్య లభిస్తున్నందున బాలికలను అత్యధికంగా నమోదు చేయవలసిన బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందన్నారు. ప్రణాళికా పరంగా ముందుకు పోవాలని లక్ష్యాలను నిర్దేశించుకోవాలని బడిబాటను ఎంచుకొని గ్రామసభల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటర్ ఫలితాలను అడిగి తెలుసుకుంటూ 10వ తరగతి పాసైన విద్యార్థినులు కేజీబీవీ లోనే ఇంటర్ లోని వివిధ కోర్సులలో చేరే విధంగా ప్రోత్సహించాలన్నారు. నిర్ణీత నమోదుకు తక్కువ కాకుండా విద్యార్థుల సంఖ్య పెంచుటకు బోధన సిబ్బంది కృషి చేయాలన్నారు. కేజీబీవీ ల ద్వారా అందించే నాణ్యమైన ప్రమాణాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియ చెప్పాలని, కేజీబీవీ కల్పించే సౌకర్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేజీబీవీ పాటించే నాణ్యత ప్రమాణాలను ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజయ్య గర్ల్స్ చైల్డ్ అభివృద్ధి అధికారి గౌసియా బేగం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## నా సమస్యను పరిష్కరించండి

**బచ్చనపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలంలోని బండనాగారం గ్రామంలో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన చల్ల నరసింహారెడ్డి భూ భారతిలో అయిన తన సమస్యను పరిష్కరించాలంటూ వేడుకున్నాడు. తన తండ్రి సిద్ధి మల్లారెడ్డి ద్వారా సంక్రమించిన భూమిలో మేమే మా తాతల నాటి నుంచి కబ్జాల ఉండి సాగు చేసుకుంటున్నామని, పట్టాలో మాత్రం వేరే వారి పేర్లు నమోదు అవుతున్నాయని, అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని, చల్ల నర్సిరెడ్డి తనయుడు చల్ల సుధాకర్ రెడ్డి అధికారులకు దరఖాస్తును అందించారు.

## విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు

**జనగామ, మన చౌరాస్తా :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2025 సందర్భంగా 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ముగిద్దాం'.. అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జనగామ జిల్లా స్కూల్ విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో 18 మంది విద్యార్థులు వ్యాసరచన,14 మంది చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను డీఈవో భోజన్న పరిశీలించారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- కొంత మంది కావాలని రాజకీయం చేస్తున్నరు
- పార్టీలో కొత్త పాత అనేది లేదు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా కొనసాగుతుందని, కొందరు కావాలని రాజకీయం చేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాలఘణపురం మండలం నెల్లుట్లలోని కేబీఆర్ గార్డెన్స్ లో, రఘునాథపల్లి మండలం నమిలిగొండలోని వెంకటేశ్వర గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఆయా మండలాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.22, 500 కోట్లతో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. అందులో భాగంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రూ.175 కోట్లతో 3,500 ఇండ్లు నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా జరిగిందని అన్నారు. అధికారులు గ్రామాలలో లబ్ధిదారులను, గ్రామస్తులను వెంట పెట్టుకొని ఒకటికి రెండుసార్లు సర్వే చేసి ఎంపిక చేశారాని అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 18 వేల దరఖాస్తులు వస్తే 9 వేల మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. అయితే అందరికీ ఒకేసారి ఇల్లు రావని, మొదటి విడతలో రాని వాళ్లకు రెండవ విడతలో అవకాశం వస్తుందని వివరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధైర్యపడవద్దని అర్హులైన వారికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఎవరో చెప్పిన మాటలు విని ఆగం కావద్దని, కావాలని కొంత మంది రాజకీయం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు స్వంత ఇంటి కల సాకారం అవుతుండడంతో అది కొన్ని రాజకీయ పార్టీలకు నచ్చడం లేదని, వారు చేయలేనిది మేం చేస్తున్నారనే అక్కసుతో అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని ప్రజలు గమనించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే తనకు చెప్పాలన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుండి అందరిని కలుపుకొని పోయే ప్రయత్నం చేస్తున్నానని, కాంగ్రెస్ నాయకులకే పెద్ద పీట వేస్తున్నాని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో నేను ఎక్కడా కూడా జోక్యం చేసుకోలేదని, పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులకు, గ్రామ పార్టీ అధ్యక్షులకు, స్థానిక నాయకులకే అప్పగించానని అన్నారు. గతంలో ఎమ్మెల్యే ఇంటి దగ్గర రాసి పంపించేది అని, కానీ ఇప్పుడు గ్రామంలో ఒకటికి రెండు అధికారులు సర్వే చేసి గ్రామస్తుల సమక్షంలో ఎంపిక జరిగిందని ఇంత పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ఎప్పుడూ జరగలేదని తెలిపారు. దీనిని కాంగ్రెస్ నాయకులు అనుకూలంగా మలచుకోవాలని సూచించారు. పార్టీలో కొత్త, పాత అనేది లేదని ఎవరు పది మందిని కదిలిస్తారో, ఎవరు పది ఓట్లు సంపాదిస్తారో వారే నాయకులు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీవో, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## వేదం@ 15 ఏళ్లు

అల్లు అర్జున్ కెరీర్ ను మలుపుతిప్పిన చిత్రాలలో 'వేదం' ఒక్కటి. క్రిష్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం 2010 జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసుకుంది. అల్లు అర్జున్ తో పాటుగా మంచు మనోజ్, అనుష్క, లేఖా వాషింగ్టన్ ప్రధాన పాత్రలు పోషించగా ప్రతి ఒక్కరి నటనకు మంచి మార్కులు పడ్డాయి. ముఖ్యంగా అప్పటికే స్టార్ హీరోయిన్ గా కొనసాగుతున్న అనుష్క ఈ మూవీ వేశ్య పాత్రలో కనిపించడం కోసం పెద్ద రిస్క్ చేసింది. తమిళంలోను రీమేక్ చేశారు.



అయితే తాజాగా ఈ సినిమా వచ్చి నేటికి 15 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సినిమాను గుర్తు చేసుకుంటూ అల్లు అర్జున్ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. వేదం' మూవీ నా కెరీర్‌లో ఒక విభిన్నమైన చిత్రం. ఈ సినిమాను ఎంతో నిజాయితీగా తీసినందుకు దర్శకుడు క్రిష్ జాగర్లమూడికి నా కృతజ్ఞతలు. అలాగే నాతో పాటు- నటించిన అనుష్క శెట్టి, మంచు మనోజ్, మనోజ్ బాజ్‌పాయ్‌తో పాటు- ఇతర నటీనటులతో కలిసి పని చేయడం ఎంతో ప్రత్యేకం. ఈ సినిమాను నిర్మించిన శోబు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనికి, సంగీతం అందించిన ఎం.ఎం. కీరవాణికి, ఇంకా చిత్రబృందం మొత్తానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు . చివరగా, ఈ సినిమాను ఆదరించి, ఎప్పటికీ నిలిచిపోయే చిత్రంగా మార్చిన అభిమానులందరికీ కృతజ్ఞతలు' అని తెలిపారు అల్లు అర్జున్. అలాగే ఈ మూవీ టైం ఫోటోలు కూడా పంచుకున్నాడు.

## థగ్‌లైఫ్‌తో అభిరామి రీ ఎంట్రీ

చిత్రపరిశ్రమలో మరోమారు సీనియర్ హీరోయిన్ అభిరామి పేరు బాగా వినపడుతుంది. మణిరత్నం దర్శకత్వంలో కమల్ హాసన్ హీరోగా తెరకెక్కిన 'థగ్‌లైఫ్' మూవీతో అభిరామి కమల్ సరసన నటించి తిరిగి ఫామ్ లోకి వచ్చింది. జూన్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. అయితే ఈ ట్రైలర్‌లో ముఖ్యంగా కమల్ హాసన్, అభిరామి మధ్య ఘాటైన లిప్‌లాక్ సీన్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యింది. దీంతో ప్రజెంట్ జనరేషన్ వారు ఈ హీరోయిన్ గురించి సెర్చింగ్ మొదలు పెట్టారు.. కేరళకు చెందిన అభిరామి అసలు పేరు దివ్య గోపికుమార్. 1995లో 'కథపురుషన్' అనే మలయాళ సినిమాలో బాలనటిగా కనిపించి ఆ తర్వాత హీరోయిన్‌గా మారింది. తెలుగులో 'థ్యాంక్యూ సుబ్బారావు', 'చార్మినార్', 'చెప్పవే చిరుగాలి' వంటి సినిమాల్లో నటించారు. ఇక 2009లో రాహుల్ పవన్‌తో ఆమె వివాహం జరిగి, దాదాపు పదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్న అభిరామి.. 2014లో తిరిగి రీ ఎంట్రీ ఇచ్చారు. నాటి నుంచి తన వయసు, ఇమేజ్, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కథాబలమున్న చిత్రాలనే చేస్తూ వస్తున్నారు అభిరామి. కానీ అందం విషయంలో మాత్రం అలాగే ఉంది . 40 ఏళ్ళు దాటిన కూడా ఇప్పటికి యంగ్ లుక్ లో మెరుస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా తనకు సంబంధించిన ఫోటోలు పంచుకుంది.



## గుడ్ వైఫ్ వెబ్ సీరిస్‌లో

# ప్రియమణి

ఒక్కప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా చక్రం తిప్పిన ప్రియమణి.. ప్రజెంట్ రీ ఎంట్రీ ఇచ్చి సిల్వర్ స్క్రీన్, స్మాల్ స్క్రీన్, డిజిటల్ స్క్రీన్ అని తేడాలు చూడడం లేదు. తనకు నచ్చిన కథలు ఎక్కడ లభిస్తే అక్కడ యాక్ట్ చేస్తుపోతుంది. రీసెంట్ గా 'ది ఫ్యామిలీ మ్యాన్' సీజన్ ఆమెకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టగా.. తాజాగా 'గుడ్ వైఫ్' అనే వెబ్ సిరిస్ తో రాబోతుంది ప్రియమణి. అమెరికన్ వెబ్ సిరీస్ 'ది గుడ్ వైఫ్' ఆధారంగా ఈ వెబ్ సిరీస్ రూపొందినట్లు- సమాచారం. సెక్స్ కుంభకోణంలో చిక్కుకున్న తన భర్తను రక్షించేందుకు ఓ మాజీ లాయర్ చేసిన పోరాటం నేపథ్యంలో అదిరిపోయే థ్రిల్లింగ్, ఎమోషనల్ డ్రామాగా ఉండనుంది. త్వరలో ఈ సిరీస్ స్ట్రీమ్రింగ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ కు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కాగా ఈ మూవీలో ప్రియమణి లుక్ చాలా డిఫరెంట్ గా ఉంది. సాధారణంగా పాన్ ఇండియా రిలీజ్ అంటే హిందీతో పాటు- దక్షిణాది భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో ఇలా విడుదల చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు ఈ సిరీస్ రిలీజ్ అంతకు మించి అని చెప్పాలి. హిందీ, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలతో పాటు- మరాఠీ, బెంగాలీలో కూడా సిరీస్ స్ట్రీమ్రింగ్ చేయనున్నట్లు- జియో హాట్ స్టార్ ఓటీటీ పేర్కొంది.

